అభినందనలు



అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న చిరుమర్తి రాజు తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా సోమవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రకాంత్‌రావు, సంజీవ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షలు



మంత్రి బండి సంజయ్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్న మాధవరం కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్‌ను సోమవారం బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ శ్రీకర్‌రావు, బాలాగర్ డివిజన్ డివిజన్ అధ్యక్షులు వినోద్‌కుమార్ గౌడ్, బీజేపీ నాయకులు గోపి, సన్నీ పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు



శ్రీశైలంలో కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు దంపతులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం కార్పొరేటర్ దంపతులు శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. ఏకవార రుద్రాభిషేకం, స్పర్శ దర్శనం చేసుకున్నారు. వారి వెంట డివిజన్ అధ్యక్షులు సీహెచ్ ప్రభాకర్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్, ఉమాకాంత్, అశోక్‌రెడ్డి, భాస్కర్‌రావు, సంతు, మన్మథరావు, జానకిరామ్, యల్లేష్, కృష్ణ, లక్ష్మీనారాయణ, లక్ష్మీ, శారద తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

కూకట్‌పల్లి: సమాజంలో అత్యంత గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు సర్వసాధారణమని ఏ పాఠశాలకు వెళ్లినా ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ చైర్మన్ సురేష్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గురాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సత్కారం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డికి సూచించినట్లు రమేష్ తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం భరత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి కేక్ కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండల్‌రెడ్డి, తూము మనోజ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్‌కుమార్, కాలనీ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్, ఎండీ మక్బూల్, రవీందర్, శ్రీనివాస్, పల్లి రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాధ్యతాయుతంగా మెలగాలి

కూకట్‌పల్లి: విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని డీసీఈబీ చైర్మన్ సురేష్ అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక బాధ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జనాభా నియంత్రణ, మహిళా సాధికారత అనే అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంఈఓ రవీందర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యాలను వెలికితీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. డ్రాయింగ్ టీచర్లు రవీంద్రరాజు, సహదేవ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని బింధుశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటు బండరాళ్లు.. ఇటు దుకాణాలు



ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టిన దృశ్యం

అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలం • పట్టించుకోని రెవెన్యూ అధికారులు



హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 69లో వ్యర్థాలు, బండరాళ్లు వేసిన దృశ్యాలు

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి మండలం హఫీజ్‌పేట్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోంది. కొందరు ఆక్రమణలు కూడా చేపట్టారు. దీంతో సర్వేనంబరు 69లో 3.29 ఎకరాల ప్రభుత్వ భూమికిగాను ఇప్పుడు ఎకరన్నర మాత్రమే మిగిలింది. ఆ మిగిలిన ప్రభుత్వ స్థలంలో కూడా పెద్ద బండరాళ్లు, వ్యర్థాలు తీసుకొచ్చి పోస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయగా వెంటనే రెవెన్యూ అధికారులు వచ్చి ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన ఇనుప రేకులను తొలగించారు. అయితే మరి కొంతమంది మాత్రం ఏకంగా ప్రభుత్వ భూమి చుట్టూ చిరు దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హఫీజ్‌పేట్ గ్రామస్తులు కోరుతున్నారు.





సర్వే నంబర్ 69లోని ప్రభుత్వ భూమిలో వెలిసిన దుకాణాలు

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. కోట్లు విలువ చేసే భూమిని కబ్జారాయుళ్లు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో వెలసిన దుకాణాలను తొలగించాలి. – గోపాల్, మదీనాగూడ

బండరాళ్లు తొలగించాలి



ప్రభుత్వ స్థలంలో వేస్తున్న భవన నిర్మాణ వ్యర్థాలు, బండరాళ్లను రెవెన్యూ అధికారులు తక్షణమే తొలగించాలి.అక్రమంగా వెలసిన దుకాణాలను కూడా తొలగించాలి. ప్రభుత్వ భూమిని పేద ప్రజల అవసరాలకు వినియోగించేలా చూడాలి.
– మల్లేష్, హఫీజ్‌పేట్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

ఆల్విన్‌కాలనీ: అంగన్‌వాడీ హెల్పర్లు, టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 10ని రద్దు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇవ్వాలని, హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలన్నారు. 24 రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమ్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, బాలింగ్ గౌతమ్ గౌడ్, జిల్లా గణేష్, కంది జ్ఞానేశ్వర్, రఘునాథ్, సీపీఎం నాయకులు శోభన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కేపీహెచ్‌బీ కాలనీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్ కేక్ కట్ చేశారు. అనంతరం విద్యుత్ కార్యాలయం సమీపంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి బండి రమేష్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేపీహెచ్‌బీ, రమ్యాగ్రౌండ్స్ వద్ద బచ్చు రాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్‌చేసి పేదలకు ఆహారం అందజేశారు. కేపీహెచ్‌బీ బస్‌స్టాండ్ వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, రేష్మ, డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, కృష్ణ రాజ్ పుత్, సంజీవరావు, మేకల మైకేల్, ఫణీంద్ర కుమార్, దిండి అరవింద్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రజిత, బోజమ్మ, సంధ్యా, యమునా, ప్రసాద్, శివ కుమార్ చౌదరి, పిడికిలి గోపాల్ చౌదరి, మల్లి, బాబ్జీ, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గాజులరామారం పాఠశాల..!



సుభాష్‌నగర్: గాజులరామారం గ్రామంలోని శిథిలావస్థకు చేరిన మండల ప్రాథమిక పాఠశాలలోని బియ్యం ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసిపోయాయి. ఇందులో 1–5వ తరగతి వరకు గాను 166 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 6 గదులు ఉండగా, పాత భవనంలో నాలుగు గదులు పూర్తిగా ప్రమాదకరంగా మారాయి. కొన్నేళ్ల క్రితం 'భవనం కూలేందుకు సిద్ధంగా ఉందన్న విషయమై జూన్ 1న 'విద్యాశాఖ.. మొద్దునిద్ర' అనే కథనం సాక్షి ప్రచురించింది. దీంతో ఎంఈఓ వసంత కుమారి స్పందించి భవనాన్ని కూల్చివేస్తామని, నూతన భవనం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని తెలిపారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సురేశ్ మాట్లాడుతూ ఆదివారం కురిసిన వర్షంతో జరిగిన నష్టం విషయమై డీఈవోకు లేఖ రాసినట్లు తెలిపారు.

ప్రజావాణికి విశేష స్పందన

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన వచ్చింది. కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సంబంధించి టౌన్ ప్లానింగ్(6), ఇంజినీరింగ్ (04), హెల్త్ అండ్ శానిటేషన్ (2) మొత్తం 12 ఫిర్యాదులు రాగా, గాజులరామారం సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్(7), ఇంజినీరింగ్ (3), ఎలక్ట్రికల్ (1) మొత్తం 11 ఫిర్యాదులు అందాయి. ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి స్వీకరించి పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌నగర్, రామిరెడ్డినగర్, మోడీ బిల్డర్స్, జనప్రియ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోందని, సిబ్బంది సరిగా లేకపోవడంతో రోజువారీ చెత్తను తరలించడం లేదని బీఆర్ఎస్ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ ఉప కమిషనర్ నరసింహకు వినతి పత్రం అందజేశారు.

ముగిసిన వారాహి పూజలు



జగద్గిరిగుట్ట: డివిజన్ పరధిలోని సీసాల బస్తీలోని వారాహి అమ్మవారికి ఆషాఢ మాస పూజలు సోమవారం ముగిశాయి. 9 రోజుల పాటు జరిగిన పూజల్లో రోజు కొక రూపంలో అమ్మవారిని అలంకరించి పూజించారు. అమ్మవారి దీక్షాపరులు, భక్తులు చివరి రోజు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొటర్ జగన్ తన కుటుంబంతో కలిసి దర్శించుకున్నారు.

తాగునీటి పైపులైన్ నిర్మించాలి

జగద్గిరిగుట్ట: డివిజన్ మగ్దూంనగర్ పొలాలబస్తీలో తాగునీటి పైపులైన్ వేయాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం ప్రజావాణిలో వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని విధుల్లో పైప్‌లైన్ పనులు పూర్తి చేశారని, మరికొన్ని చోట్ల అలాగే వదిలేశారని, దీని వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, కృష్ణ, నాయకులు ఇమామ్, ప్రభాకర్, శంకర్, అశోక్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగుల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం'

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల గొంతును నొక్కుతుందని భారతీయ విద్యార్థి పరిషత్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ రేగోడ్ నగేశ్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో సెక్రటేరియేట్ ముట్టడి' కార్యక్రమంలో భాగంగా నగేశ్‌ను చంద్రగిరినగర్‌లోని తన నివాసంలో సోమవారం తెల్లవారు జామున పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో నిరసనలు తెలిపే స్వేచ్ఛను హరిస్తూ నిర్బంధాలు, అరెస్టులు చేశారో ఈ ప్రభుత్వం కూడా అదేబాటలో సాగుతుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులపై వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలి లేకుంటే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

ఎమ్మెల్యే గాంధీతోనే నియోజకవర్గ అభివృద్ధి



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆల్విన్‌కాలనీ డివిజన్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని పలువురు నాయకులు అన్నారు. ఎమ్మెల్యే గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడుస్తామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, మరింత అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తామని, ఎమ్మెల్యే గాంధీ ఏ నిర్ణయం తీసుకున్నా తమకు శిరోధార్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రత్నేశ్వరరావు, రత్నారావు, బొప్పన మధు, కట్టా శ్రీనివాస్, మురళి, ప్రభాకర్, హరిబాబు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో నాగుల సత్యం, తదితరులు

మోతీనగర్: అమ్మమాట... అంగన్‌వాడి బాట.. అని బీఆర్ఎస్ కూకట్‌పల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నాగుల సత్యం గంగపుత్ర అన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ వీ రామారావు నగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో రెండేళ్లకు పైబడిన విద్యార్థిని, విద్యార్థులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి సూపర్‌వైజర్ అనిత మాట్లాడుతూ రెండేళ్లు పైబడిన చిన్నారులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫాం, పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలకు పౌష్టికాహారం అందుబాటులో ఉంటుందని గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిత్యం అంగన్‌వాడి కేంద్రానికి వచ్చే విద్యార్థులకు పోషకాహారం అందించటంతో పాటు అంగన్‌వాడి టీచర్, ఆయాల సంరక్షణలో చిన్నారులు క్షేమంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు మాధవి, హేమలత, విజయ, ఆయాలు వరలక్ష్మీ, స్వరూప, విద్యావతి, అనిత, పద్మ, స్థానిక నాయకులు ఆవుల సంజీవ్ పటేల్, ఎం. కృష్ణ, బి. సాంబ ముదిరాజ్, శివ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



కూకట్‌పల్లి: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థుల భాగస్వాములు కావాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అశోక గార్డెన్స్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఏసీపీ శ్రీనివాసరావు, కళాశాల చైర్మన్ డాక్టర్ కొరదాల నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ సేవించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కాలేజ్ చైర్మన్ డా. కొరదాల నరేష్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తు, కాలేజీ డైరెక్టర్ కేవీ లావణ్య, ఆర్గనైజ్ డీన్ మౌనిక, ప్రిన్సిపల్ బిఎన్ రాజేష్, వైస్ ప్రిన్సిపల్ భాగ్య, స్టూడెంట్స్ డీన్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు..?

- చిన్నపాటి వర్షానికే వరద నిల్వ
- నత్తనడకన డ్రెయిన్‌లు, క్యాచ్‌మెంట్ పాయింట్ల నిర్మాణాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు
- త్వరగా పూర్తి చేయాలని విన్నపం



చింతల్ ప్రధాన రోడ్డులోని రిడ్జ్ టవర్స్ ఎదురుగా అసంపూర్తిగా పనులు..

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంట వర్షపు నీరు నిల్వ లేకుండా చేపడుతున్న డ్రెయిన్‌లు, క్యాచ్‌మెంట్ పాయింట్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల పనులు పూర్తికాగా, మరొకొన్ని ప్రాంతాల్లో ఇంకా ప్రారంభ దశలోనే ఉండడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. అల్వాల్, జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లు, దుండిగల్, కొంపల్లి మున్సిపల్ ప్రాంతాలను ఆనుకుని 12 చోట్ల వరద నిలుస్తుందని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కోరుతూ ఆయా స్టేషన్ల ట్రాఫిక్ సీఐలు కొన్ని నెలల క్రితం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు నివేదిక అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత సర్కిళ్ల, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయా ప్రాంతాల్లో వరద క్యాచ్‌మెంట్, డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ పనులు వేసవి ప్రారంభంలోనే చేపట్టి పూర్తి చేయాల్సి ఉండగా, వర్షాలు ప్రారంభమైనా ఇంకా కొనసాగుతుండడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డ్రెయిన్లు, క్యాచ్‌మెంట్ ప్రాంతాలు..

జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని మహదేవపురం చౌరస్తా, బాలాజీ లేఅవుట్ ప్రధాన రోడ్డు, జీడిమెట్ల బస్ డిపో సమీపంలోని నర్సాపూర్ రాష్ట్ర రహదారి వెంబడి, చింతల్ ప్రధాన రోడ్డులోని రిడ్జ్ టవర్స్, ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని జీడిమెట్ల గ్రాంధీ విగ్రహం వద్ద, కొంపల్లి ఎస్ఎన్ఆర్ గార్డెన్ సమీపంలో, అల్వాల్ వెంకటాపూర్, జ్యోతినగర్, లయోలా కాలేజీ బస్టాప్ సమీపంలో డ్రెయిన్లు, వాటర్ క్యాచ్‌పాయింట్లు నిర్మిస్తున్నారు.

ఈ ప్రాంతాలపై నిర్లక్ష్యం..

ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డులోని రంగారెడ్డినగర్ స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో, సంజయ్‌గాంధీనగర్– నెహ్రూనగర్ రోడ్డు, గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా, సూరారంలోని సాయిపూజా థియేటర్ల సమీపంలో వర్షాకాలంలో పెద్ద మొత్తంలో వరద నిలుస్తున్నది. అయితే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు అధికారులు అందజేసిన నివేదికలో ఈ ప్రాంతాలు లేకపోవడం గమనార్హం.

కొరవడిన ముందస్తు ప్రణాళిక..

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఆలస్యంగా డ్రెయిన్ల పనులు ప్రారంభించారు. జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలోకి వచ్చే ఆదర్శనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో మాత్రమే పనులు పూర్తికగా మిగతా ప్రాంతాల్లో ప్రారంభ దశలో, మధ్యలోనే పనులు ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. జీడిమెట్ల బస్ డిపో సమీపంలో పనులు మరో నెల రోజులు పట్టనున్నాయి. అదేవిధంగా చింతల్ ప్రధాన రోడ్డులోని గణేశ్‌నగర్ వద్ద డ్రెయిన్ లైన్, క్యాచ్‌పిట్ పాయింట్లను పూర్తి చేయగా రిడ్జ్ టవర్ పైపులు వేసినా మూతలు ఏర్పాటు చేయలేదు. బాలాజీ లేవుట్ చౌరస్తా, మహాదేవాపురం ప్రాంతాల్లో పనుల ఉనికే లేదు. అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో జీడిమెట్ల గ్రామం గాంధీ విగ్రహం, కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్ సమీపంలో పనులు పూర్తి కావాల్సి ఉంది.